క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

• జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



మాట్లాడుతున్న ఆదర్శ్ రాజేంద్రన్

కోవూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కోవూరు నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ తహసీల్దార్లకు సూచించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తహసీల్దార్లతో మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఎన్నికల నియమావళిపై తహసీల్దార్లు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మండలాల్లోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నుడా వైస్‌చైర్మన్ బాపిరెడ్డి, కోవూరు ఆర్వో, తెలుగుగంగ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ వెంకటరమణబాబు, తహసీల్దార్లు విజయశ్రీ, సురేష్ బాబు, శైలేంద్రకుమార్, డీటీలు భానుప్రకాష్, ఎస్కే బషీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వైద్యురాలు తనూజ

వెంకటాచలం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ వైద్యురాలు తనూజ అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్‌ఏ–3 పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆమె తన సొంత నగదుతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణతో చదవాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం నిడిగుంటపాళెం బాలికల వసతిగృహ విద్యార్థినులకు ప్రత్యేక తరగతుల కోసం రూ.7 వేలు నగదును హెచ్‌ఎం చలపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు భూమి పట్టాలివ్వండి

కావలి: ముప్పై ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయకపోవడం, చేనేత కార్మికులను చిన్నచూపు చూడటమేనని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పూజల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలిగిరి మండలం కొత్తపేట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు1లో 48 ఎకరాల సీలింగ్ భూమిని మొత్తం 44 కుటుంబాలకు 1993లో ఒక్కొక్క కుటుంబానికి 1.10 ఎకరాల వంతున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆ భూములకు ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వకుండా చేనేతలను అధికారులు ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. చేనేతలు సాగు చేసుకుంటున్నా భూములకు అధికారులు వన్‌బీ అడంగళ్ పాస్ పుస్తకాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చేనేతలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కోరారు.

వీపీఓల నూతన కమిటీ ఏర్పాటు

సోమశిల: అనంతసాగరం మండలం వెలుగు వీపీఓల యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చిలకలమర్రి సెక్టార్‌కు పీ కల్పన, పీ భూమిక, అనంతసాగరానికి ఎం.సౌభాగ్యమ్మ, వై.సుజాత, సోమశిలకు బీ లక్ష్మి, వై శ్రీకళ, రేవూరుకు సీహెచ్ లక్ష్మి, పీ ఆదిలక్ష్మి, కమిటీ గౌరవ అధ్యక్షుడిగా షేక్ అన్వర్‌బాషా, కన్వీనర్‌గా సీహెచ్ లక్ష్మితో పాటు కో కన్వీనర్లను ఎన్నుకున్నారు. వెలుగు వీపీఓల జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు జీ శివప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధితో గెలుస్తాం

• ఖలీల్ అహ్మద్



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో రానున్న ఎన్నికల్లో గెలుపొందుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. 42, 43, 48వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని కోటమిట్టలోని షాదీమంజిల్లో.. 3, 4, 5వ డివిజన్ల సంబంధించి మైపాడు గేట్ సమీపంలోని కేపీఆర్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఎవరూ చేయని రీతిలో నగరాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభివృద్ధి చేశారని చెప్పారు. తనకు నియోజకవర్గ సమన్వయకర్తగా సీఎం అవకాశం కల్పించారని చెప్పారు. తనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్పొరేటర్లు కరిముల్లా, సంక్రాంతి అశ్విని, పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర, మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు, 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న రంగారెడ్డి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రాభివృద్ధి ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిందని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 27వ డివిజన్లోని చంద్రమౌళీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించాక అనేక అభివృద్ధి పనులను చేపట్టారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రూరల్ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎమ్మెస్సెమ్ఈ రాష్ట్ర డైరెక్టర్ పాశం శ్రీనివాస్, నేతలు రామశివారెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, షేక్ బాబు, ఏసునాయుడు, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తాళ్లూరు సురేష్ బాబు, నవాబ్‌జాన్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బయ్య మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి, ఉపాధ్యాయులు రాజ మనోహర్, ఖాజారహంతుల్లా, శైలజ, పీఈటీ చిన మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణస్వామి వ్రత పూజను నిర్వహిస్తున్న అర్చకులు

కోవూరు: మాఘమాసం సందర్భంగా స్థానిక గాంధీ పార్కుసెంటర్‌లోని కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు పెద్ద సంఖ్యలో హాజరై వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంతాచార్యులు సత్యనారాయణస్వామి వ్రత విశిష్టతను వివరించారు. అనంతరం వ్రతంలో పాల్గొన్న దంపతులను శాలువాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, రుత్విక్కులు జయప్రకాష్‌స్వామి, రాఘవాచార్యులు, నాగరాజుస్వామి, శేఖర్‌స్వామి పాల్గొన్నారు.



సామూహికంగా వ్రతాన్ని ఆచరిస్తున్న దంపతులు

వైభవంగా గంధమహోత్సవం



సోమశిల: అనంతసాగరంలోని శ్రీహజరత్ సయ్యద్‌షా యూసఫ్ ఆలీషా ఖాదరి 42వ గంధమహోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి సొందల్ మాలితో ప్రారంభమైన గంధమహోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఫకీర్ల విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ గంధ కలశాన్ని సజ్జదా ఇంటి వద్ద నుంచి ఆలీషా ఖాదరి దర్గాకు తీసుకు వచ్చారు. గంధాన్ని సమాధులకు లేపనం చేసి భక్తులకు పంచి పట్టారు. ఖవ్వాలీని నిర్వహించారు.

లైవ్ ఆర్కెస్ట్రా బ్యాండ్ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మహానగరాలకే పరిమితమైన లైవ్ ఆర్కెస్ట్రా బ్యాండ్ సింహపురిలో ప్రారంభించడాన్ని పలువురు అభినందించారు. ఎస్సార్ లైవ్ ఆర్కెస్ట్రా బ్యాండ్ ప్రారంభ కార్యక్రమాన్ని పురమందిర ప్రాంగణంలో రాజ్, సాగర్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఆర్డీఓ మలోల, ట్యాక్స్ కన్సల్టెంట్ కృష్ణమోహన్, 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు హాజరయ్యారు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన మ్యూజిషియన్స్, గాయకులు 30 మందికిపైగా విచ్చేశారు. పెంచలరెడ్డి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'కృష్ణచైతన్య' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(టౌన్): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో కృష్ణచైతన్య జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, కళాశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. 26 ఏళ్ల క్రితం 140 మంది విద్యార్థులతో కృష్ణచైతన్య విద్యాసంస్థలను ప్రారంభించామని, ప్రస్తుతం 17 వేల మంది విద్యనభ్యసిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ రాణాప్రమోద్‌రెడ్డి, డీన్లు షిరీస్ బాబు, సుధారాణి, జ్యోతి, రామాంజనేయరెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.08 కోట్లతో ఉప ఖజానా భవన నిర్మాణం

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



ఉప ఖజానా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో రూ.1.08 కోట్ల వ్యయంతో ఉపఖజానా భవన నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరు ఉపఖజానా భవన నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా డిప్యూటీ డైరెక్టర్ డీ గంగాధర్, కోవూరు ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్, ఎస్‌డబ్ల్యూడీఏసీ ఈఈ శ్యాంసన్, ఏఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రామాంజనేయులు, డీఏఏటీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సహకార సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా జయప్రదానికి పిలుపు



మాట్లాడుతున్న సుమన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీఐటీయూ, విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుమన్ కోరారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మహా ధర్నాను నిర్వహించనున్నామని వివరించారు.

ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవం నేడు



ప్రారంభానికి సిద్ధమైన నూతన భవనం

మనుబోలు: అక్కంపేటలో ఎన్ఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించనున్నట్లు మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం అక్కంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం పాఠశాలల క్రమబద్ధీకరణలో భాగంగా అక్కంపేట ప్రాథమికోన్నత పాఠశాలను మూతవేసేందుకు యత్నించగా కోర్టును ఆశ్రయించి పాఠశాలను కాపాడుకున్నామని తెలిపారు. తన సొంత నిధులతో విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో అన్ని సౌకర్యాలు కల్పించి క్రమంగా వారి సంఖ్య పెరిగేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆ తరువాత స్థానిక ఎమ్మెల్యే కాకాణి సహకారంతో ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్పు చేయించుకున్నామని తెలిపారు. ఉన్నత పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేందుకు రూ.25 లక్షలు వెచ్చించి బస్సు సౌకర్యం కల్పించామని చెప్పారు. ప్రభుత్వం మన బడి నాడు–నేడు ఫేజ్–2లో భాగంగా జెడ్పీ ఉన్నత పాఠశాలకు నూతన భవనం కోసం రూ.1.75 కోట్లు కేటాయించిందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తాను చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్త భవనానికి తన తండ్రి నారపరెడ్డి సీతారామిరెడ్డి(ఎన్ఎస్సార్) పేరు పెట్టేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పాఠశాల భవన ప్రారంభోత్సవానికి అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కిరణ్ సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఈ సమావేశంలో విద్యా కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసులురెడ్డి, పెనుమల్లి రామకృష్ణారెడ్డి, శేషారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

25న వనభోజనాలు



మాట్లాడుతున్న దశరథరామయ్య

నెల్లూరు(మినీబైపాస్): వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వనభోజనాలను ఈ నెల 25న నిర్వహించనున్నామని జంగమ సేవా సంఘ అధ్యక్షుడు గంధవళ్ల దశరథ రామయ్య పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. పరమేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనను నిర్వహించనున్నామని వివరించారు. జంగమ సంఘీయులు తరలిరావాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి



నెల్లూరు సిటీ: ట్రాక్టర్ ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చింతారెడ్డిపాళేనికి చెందిన కిశోర్‌బాబు, సౌభాగ్య రెండో కుమారుడు యువకిశోర్ (18) బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. తండ్రి బైక్ తీసుకొని నవాబుపేటలోని స్నేహితుడి ఇంటికి మధ్యాహ్నం బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై చింతారెడ్డిపాళెం నుంచి ఎన్టీఆర్‌నగర్ వైపు వెళ్లే దారిలో ఇసుక ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. అదుపు తప్పి బైక్‌పై నుంచి కిందపడి గాయపడిన యువకిశోర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయల్ యువర్ డీఎంకు రెండు ఫిర్యాదులు

నెల్లూరు సిటీ: నగరంలోని నెల్లూరు – 1, 2వ డిపోల్లో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

- నెల్లూరు నుంచి పామూరుకు సంగం బైపాస్ మీదుగా ఎక్స్‌ప్రెస్ బస్సును నడపాలని వింజమూరుకు చెందిన హజరత్ కోరారు. అయితే కొన్ని కారణాల రీత్యా ఎక్స్‌ప్రెస్ బస్సును నడపలేమని ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు.
- ముత్తుకూరు మండలం పోలంరాజుగుంటకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని అదే ప్రాంతానికి హరనాథరెడ్డి కోరారు. దీనిపై పరిశీలిస్తామని రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పేర్కొన్నారు.

12 నుంచి తహసీల్దార్లకు శిక్షణ

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తహసీల్దార్లకు శిక్షణ కార్యక్రమాలను విజయవాడలో నిర్వహించనున్నారని కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో ఈ నెల 12 నుంచి 16 వరకు, రెండో విడతలో 19 నుంచి 23 వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నారని చెప్పారు.

రోటరీ జోన్ – 1 అసిస్టెంట్ గవర్నర్‌గా శేఖర్‌రెడ్డి



నెల్లూరు(బృందావనం): రోటరీ సింహపురి జోన్ – 1 అసిస్టెంట్ గవర్నర్‌గా కొండా శేఖర్‌రెడ్డిని రోటరీ 3160 గవర్నర్ సాధు గోపాలకృష్ణ నియమించారు. దీనికి సంబంధించిన వివరాలను శేఖర్‌రెడ్డి తెలియజేశారు. గోవాలో రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అసిస్టెంట్ గవర్నర్స్ సెమినార్‌లో ఈ మేరకు తనను నియమించారని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి తన ఇంట్లో మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సుజాతమ్మ కాలనీలో నాగభూషణం (48) ఒంటరిగా నివాసం ఉంటున్నారు.

కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన బయటకు రాకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు పక్కింటి వారు తెలియజేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌బీకేల ద్వారా రైతులకు పురుగు మందులు

కొడవలూరు: ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన పురుగు మందులు అందిస్తున్నట్లు ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ వారి మన గ్రోమోర్ ద్వారా పురుగు మందులను ఆర్‌బీకేల్లో పొందవచ్చని చెప్పారు. పురుగు మందులు అవసరమైన రైతులు సంబంధిత ఆర్బీకేలోని వీఏఏను సంప్రదించి ఇండెంట్ నమోదు చేసుకుంటే మరుసటి రోజునే అందజేస్తామని చెప్పారు. మండలంలోని అన్ని ఆర్బీకేలకు నార్తురాజుపాళెంలోని మన గ్రోమోర్ నుంచి పురుగు మందులు సరఫరా చేస్తామన్నారు. మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘంటసాల చిరస్మరణీయుడు

నెల్లూరు(బృందావనం): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడని సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఘంటసాల చిత్రపటానికి శనివారం నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఘంటసాల ఆలపించిన ప్రతి పాటకూ ఓ విశిష్టత ఉందని పేర్కొన్నారు.